క్లుప్తంగా

బదిలీలపై అదనపు ఎస్పీకి కృతజ్ఞతలు



అదనపు ఎస్పీని సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు మంగళవారం ఏలూరులో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నవారికి ఇటీవల నిర్వహించిన బదిలీలు పారదర్శకంగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. ఎస్పీ శివకిషోర్‌కు, పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

జయరాజుకు ఘన నివాళి



జయరాజుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జుజ్జువరపు జయరాజు 55వ జయంతిని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జుజ్జువరపు ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి బేతాళ సుదర్శన్ జయరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కటింగ్ చేశారు. ప్రతి ఒక్కరూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల కోసం గళం ఇప్పాలని, ఉద్యమానికి కొత్త రూపు తీసుకొచ్చింది జయరాజు అని గుర్తుచేశారు. ఆయన లేని లోటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు తీరనిలోటన్నారు. ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ యువత జయరాజుని స్ఫూర్తి కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్, ఎస్సీ ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ వ్యవస్థాపక అధ్యక్షులు మేతర అజయ్ బాబు, దళిత సేన అధ్యక్షులు జుజ్జువరపు రవి ప్రకాష్, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడు గూడూరు రాజేష్ బాబు, దళిత నాయకులు బయ్యారపు కుటుంబరావు, మేతర అశోక్ జెర్రి పోతుల జై కుమార్, బద్ది జగ్గారావు, బేతపూడి నారాయణ స్వామి, ప్రసాద్, చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

పీర్ల పండుగలో జేపీ



పీర్ల పండుగలో జయప్రకాష్, ముస్లింలు

ఏలూరు టౌన్: ఏలూరు 12వ డివిజన్ రజాక్ వీధిలో పీర్ల పండుగకు గౌస్ మొహిద్దీన్ ఆహ్వానం మేరకు హాజరైన వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నూకపెయ్యి సుధీర్‌బాబు, నెరుసు చిరంజీవి, మున్నుల జాన్‌గురునాథ్, కిలాడి దుర్గారావు, కొల్లిపాక సురేష్, జనార్ధన్, దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్‌కుమార్, సాయి, స్వామిదాస్, బాలకృష్ణ, రాము, కరీం, ఆదిల్, ఇమ్రాన్, షరీఫ్, సుభానీ, నజీర్, ఇక్బాల్, బషీర్, రబ్బు తదితరులు పాల్గొన్నారు.

వారి మృతి కళారంగానికి తీరని లోటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తెలుగు సినీరంగానికి సంబంధించి కోట శ్రీనివాసరావు, బి.సరోజాదేవి మృతి తెలుగు కళారంగానికి తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. వారి సంతాప సభ స్థానిక అమీనాపేటలో మంగళవారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సభలో సంఘ అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, నంది అవార్డు గ్రహీత మహ్మద్ ఖాజావలీ, సంఘ కోశాధికారి లేళ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగాస్త్ర మాట్లాడారు. మహానటుల సేవలను కొనియాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- ఇన్వెస్ట్‌మెంట్‌లు, జాబ్‌లు, లోన్‌ల పేరుతో టోకరా
- సొమ్ములు కాజేసిన గంటలో 1930కి ఫిర్యాదు చేయాలి
- రికవరీ చేస్తున్న ఏలూరు సైబర్‌సెల్ పోలీస్ అధికారులు



కైకలూరుకు చెందిన బాధితుడికి సొమ్ము రికవరీ చేస్తున్న ఎస్పీ శివకిషోర్



బాధితురాలికి సొమ్ము రికవరీ చేస్తున్న సైబర్‌సెల్ సీఐ దాస్, ఎస్సై వల్లీపద్మ

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక న్యాయవాదిని సైబర్ నేరగాళ్లు మోసం చేసి భారీగా సొమ్ము కాజేశారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ ప్రకటన చేస్తూ, పెట్టుబడి పెడితే భారీగా డబ్బులు ఆర్జించే అవకాశం ఉందని నమ్మించారు. వాట్సాప్ గ్రూప్‌లో కొందరు ఫేక్ వ్యక్తులను పరిచయం చేస్తూ, పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు ఆర్జించినట్లు చెప్పించారు. వీటిని నమ్మిన న్యాయవాది ఏకంగా రూ.60 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. తీరా కొద్దిరోజులు గడిచాక తాను మోసపోయినట్టు అర్థం కావటంతో ఏలూరు సైబర్ పోలీసులను ఆశ్రయించారు.

ఏలూరు నగరానికి చెందిన ఒక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌ను సైతం సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఆశ చూపించారు. ఏకంగా ఆయన వద్ద నుంచి రూ.3 కోట్లకు పైగా డబ్బులు కాజేయటం గమనార్హం. ఆయా ఫేక్ కంపెనీల పేరుతో ఇన్వెస్ట్‌మెంట్ చేయాలంటూ మాయమాటలు చెప్పటంతో బాధితుడు నమ్మేశాడు. సైబర్‌నేరగాళ్ల మోసాన్ని గ్రహించిన బాధితుడు ఏలూరు సైబర్‌సెల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ స్టేషన్ వద్ద ఏలూరు సైబర్ సెల్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో ప్రతి రోజూ సైబర్‌నేరగాళ్ల బారిన పడుతున్నవారు కనీసం నలుగురు, ఐదుగురు ఉండడం గమనార్హం. నెలలో కనీసం 100 నుంచి 150 మంది వరకు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. ఏలూరు సైబర్ సెల్ సీఐ జి.దాస్, ఎస్సై వల్లీపద్మ ఆధ్వర్యంలో సైబర్ సెల్ టీమ్ బాధితులు పోగొట్టుకుంటున్న సొమ్ములు రికవరీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

బాధితులకు అండగా

ఇటీవల కాలంలో సైబర్ నేరాలపై ప్రజలను పోలీస్ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్స్, బ్యాంకు రుణాలు, డిజిటల్ అరెస్టులు, అక్రమ వ్యాపారాలు, ఆన్‌లైన్ బిజినెస్‌లు పేరుతో ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలకు గురైన బాధితులు తక్షణమే 1930కు ఫిర్యాదు చేయాలని సైబర్‌సెల్ పోలీసులు కోరుతున్నారు. ఏలూరు జిల్లాలో ఇటీవల కాలంలో ఏకంగా రూ.12 లక్షల మేర సొమ్ములను రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

- కైకలూరు మండలం తామరకొల్లు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి శ్రీనివాసరావు సెల్‌ఫోన్‌కు సోషల్ మీడియాలో ఒక లింక్ వచ్చింది. ఏపీకే లింక్ ఫైల్ ఓపెన్ చేశారు. సైబర్ నేరగాళ్లు శ్రీనివాసరావు బ్యాంకు ఖాతాలో నుంచి ఏకంగా రూ.1,64,000 సొమ్మును వారి ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన అప్రమత్తమై బ్యాంకు అధికారులను సంప్రదించారు. పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కైకలూరు టౌన్, ఏలూరు సైబర్‌సెల్ పోలీసులు సంయుక్తంగా బాధితుడు పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేశారు. ఈ సొమ్మును ఎస్పీ కేపీ శివకిషోర్ చేతులమీదుగా అందజేశారు.
- ఏలూరుకు చెందిన ఒక మహిళ తిరుపతి నుంచి ప్రయాణిస్తుండగా బస్సులో ఆమె సెల్‌ఫోన్ చోరీ చేశారు. సెల్‌ఫోన్ ఆధారంగా ఆమె బ్యాంకు ఖాతాలో డబ్బులు కాజేశారు. బాధితురాలు వెంటనే 1930కు ఫిర్యాదు చేయగా ఏలూరు సైబర్ సెల్ సీఐ దాస్, ఎస్సై వల్లీపద్మ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాలను ట్రేస్ చేసి బాధితురాలి సొమ్ము రూ.25 వేలు మంగళవారం ఏలూరులోని సైబర్‌స్టేషన్‌లో అందజేశారు.

గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలి



సైబర్ నేరగాళ్ల మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో సైబర్ నేరాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా సైబర్‌నేరగాళ్లు సొమ్ములు కాజేస్తే, గంట వ్యవధిలో సైబర్‌సెల్ పోలీసులకు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలి. 1930కు కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వటం ద్వారా పోగొట్టుకున్న సొమ్ము రికవరీ చేసేందుకు 90 శాతం అవకాశం ఉంటుంది. సెల్‌ఫోన్ చోరీ అయినా లేదా పోగొట్టుకుంటే వెంటనే నెంబర్ బ్లాక్ చేయించటం ద్వారా బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ము కాజేసే అవకాశం ఉండదు. ఆన్‌లైన్ పెట్టుబడులు, బ్యాంక్ లోన్స్, జాబ్స్, డిజిటల్ అరెస్ట్‌లపై అప్రమత్తంగా ఉండాలి.

– జి.దాస్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఏలూరు సైబర్ సెల్

సీఆర్ఆర్ విద్యార్థినికి భారీ వేతనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని పెనుమచ్చ నిఖిత అమెజాన్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్‌గా ఎంపికైందని ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఉద్యోగానికి ఆమెకు ఏడాదికి రూ. 46.3 లక్షలు వేతనంగా పొందుతున్నట్టు చెప్పారు. ఆమె ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ నాలుగేళ్ల కోర్సు ఇటీవల పూర్తి చేసిందన్నారు. ఆమెను కళాశాల కరెస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు (మల్లి బాబు), ఇన్‌చార్జి కరెస్పాండెంట్ కొండా హరిరామ కృష్ణంరాజు తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరు టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మహిళ మృతిచెందింది. ఏలూరుకు చెందిన షేక్ మల్లిక (59) సీఆర్ఆర్ కాలేజీ వద్ద మూడురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైంది. ఆమెను ఏలూరు నగరంలోని ఒక ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ శస్త్ర చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యస్థితి విషమంగా ఉండడంతో ఏలూరు జీజీహెచ్‌కు తీసుకురాగా ఐసీయూలో చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ మృతిచెందగా వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి హాస్పిటల్ ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు.

ప్లస్ టూ కళాశాలల ఏర్పాటుకు వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు కార్పొరేషన్‌లో ప్లస్ టు కాలేజీల ఏర్పాటుకు కృషి చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు పీఎఫ్ మినహాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, నగర అధ్యక్షుడు కురమ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగించాలి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు (టూటౌన్): ప్రతి న్యాయవాదీ కక్షిదారులకు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఒక వారం రోజులపాటు మధ్యవర్తిత్వం – దేశం కోసం అంశంపై వివిధ రకాల అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. మంగళవారం ఏలూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ న్యాయవాదులతో ఏర్పాటుచేసిన సదస్సులో ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ పరిష్కారానికి అనుకూలమైన కేసులను మధ్యవర్తిత్వానికి రిఫర్ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, కక్ష దారులు ఉపయోగించుకుని కేసులు పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనె సీతారాం, న్యాయవాదులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

ఏలూరు (టూటౌన్): మధ్యవర్తిత్వం ద్వారా ఇన్సూరెన్స్ క్లయిములు, వాహన ప్రమాద బీమా కేసులను ఇరు పక్షాలు ఆమోద యోగ్యమైన పరిష్కారాన్ని పొందవచ్చునని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఇన్సూరెన్స్ కంపెనీ, బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ రాజీ చేసుకోవడంలో సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ 15100 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. బ్యాంకులకు సంబంధించిన ప్రీ లిటిగేషన్ కేసులను సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఏయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునేశ్వరరావు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి



మహిళకు గ్యాస్ కిట్ అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): గ్యాస్ వినియోగం పట్ల మహిళలు జాగ్రత్తలు పాటించాలని హెచ్‌పీసీఎల్ సేల్స్‌మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎక్సెల్ గ్యాస్ కంపెనీ ప్రొప్రైటర్ మోటపర్తి శ్రీనివాస్ సూచించారు. స్థానిక 15వ డివిజన్ ఆముదాల అప్పలస్వామి కాలనీలో హెచ్‌పీసీఎల్ 51వ వార్షికోత్సవం సందర్భంగా కార్పొరేటర్ తంగెళ్ల రాము అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్యాస్ వినియోగం, ఊర్లు వెళ్లినప్పుడు గ్యాస్ పొయ్యి వద్ద తీసుకొనే జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు 1906 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురికి గ్యాస్ కనెక్షన్ల సంబంధించిన కిట్లు బహుమతిగా అందజేశారు. కార్పొరేటర్ రాము మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ ద్వారా తమ డివిజన్‌కు సుమారుగా 270 కలెక్షన్లు దీపం ద్వారా ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. 15వ డివిజన్ దగ్గరలో సేల్స్ పాయింట్ ఇప్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎక్సెల్ గ్యాస్ కంపెనీ మేనేజర్ బి.సత్యనారాయణ, ఎక్సెల్ కంపెనీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచడం ద్వారా స్వయం సమృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీఐ ప్రిన్సిపాల్ భూషణం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువతలో, ముఖ్యంగా దివ్యాంగులైన యువతీ యువకులలో నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారు స్వయం సమృద్ధి సాధించవచ్చనే లక్ష్యంతో దివ్యాంగులు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ డి.భూషణం అన్నారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ – టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న నైపుణ్య శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, వాటి ద్వారా లభించే ప్రయోజనాలు, దివ్యాంగ యువతకు నైపుణ్యాభివృద్ధి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ కె.రామచంద్రరావు, కళాశాల సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ కె.శ్రీలత పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఈవోపీఆర్‌డీ, గ్రామ కార్యదర్శులు విధిగా ప్రతి రోజూ పర్యవేక్షించాలన్నారు. సంపూర్ణ పారిశుద్ధ్యం అమలుకు కృషి చేయాలని అన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి

కొయ్యలగూడెం: టైలర్ల షాపులకు వచ్చే విద్యుత్ బిల్లులు ప్రభుత్వం కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టైలర్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి డిమాండ్ చేశారు. స్థానిక వినాయకుని ఆలయం వద్ద మంగళవారం టైలర్ల సంఘ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

19న పారిశుద్ధ్య కార్మికుల నిరసన



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

చింతలపూడి : జీఓల ప్రకారం జీతాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల శ్రమను దోచుకుంటోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ ఆరోపించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి మేజర్ స్థాయి నుండి నగర పంచాయతీగా రూపుదిద్దుకొని నాలుగేళ్లు దాటిందని, అప్పటినుంచి ప్రజల వద్ద మున్సిపల్ నిబంధనల ప్రకారం పన్నులు వసూలు చేస్తున్నప్పుడు కార్మికులకు జీఓ నిబంధనలు ఎందుకు వర్తింపజేయటంలేదని ఆయన ప్రశ్నించారు. కార్మికులకు సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. రోజుకు 9 గంటలకుపైగా పని చేయించుకుంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారని, ఈ మేరకు సమ్మె నోటీసు నగర పంచాయతీ కమిషనర్‌కు, లేబర్ డిపార్ట్‌మెంట్‌కు అందజేస్తామని తెలిపారు.

భర్తపై వరకట్న వేధింపుల కేసు

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తన భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేయటంతో భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అరుంధతీ కాలనీకి చెందిన వినుకొండ ఉషారాణి (34), బాలరాజుకు 2003లో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాలరాజు టోల్‌గేట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల వారిద్దరి మధ్యా విభేదాలు రావటంతో అదనపు కట్నం రూ.10 లక్షలు తీసుకురావాలంటూ భార్య ఉషారాణిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. భార్య టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి



పశు వైద్యశిబిరాన్ని ప్రారంభించిన మనోహర్

దెందులూరు: రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ల గ్రామ సచివాలయం వద్ద పశు వైద్య శిబిరం, లేగదూడలు అందాల పోటీలను ఆయన ప్రారంభించారు. పాడి పశువుల కొనుగోలుకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే బడేటి చంటి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, విజయవాడ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ టి.గోవిందరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రెగ్యులర్ టీచర్లతో సమానంగా పని చేస్తున్న ఎంటీఎస్ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీలో అర్హత సాధించినప్పటికీ 25 సంవత్సరాల తరువాత మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన ఉద్యోగాలు పొందినా రెగ్యులర్ టీచర్ల మాదిరిగానే పూర్తి సమయం బోధనా విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమ సమస్యలపై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఇతర మంత్రులకు వివిధ సందర్భాల్లో విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న నాథుడే లేడని వాపోయారు.

పంట తెచ్చుకోకుండా చేశారు!



సమావేశమైన గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు

టి.నరసాపురం: గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి ముందే రైతులకు పొలాల్లోకి వెళ్లటానికి గ్రావెల్ రోడ్లు వేస్తామని, హైవే పక్కన సర్వీసు రోడ్డు వేస్తామని చెప్పి నేడు కనీసం తమ పొలాల్లో నుంచి పంట తెచ్చుకోవడానికి వీలు లేకుండా చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద రైతులు సమావేశం నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వారు ఇచ్చిన మాట ప్రకారం తమ పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు, పంట బయటికి తెచ్చుకోవడానికి సర్వీస్ రోడ్డు వెంటనే వేయించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు త్వరలో ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు రైతులు తెలిపారు. టి.నరసాపురం మండల కేంద్రానికి ఎగ్జిట్ రోడ్డు ఇవ్వాలన్నారు. దీనిపై మండలంలోని రైతులందరూ త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉంటున్నామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	23
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

బహిరంగ ప్రకటన

[illegible]

శ్రీ జి. నాగరాజు, అడ్వకేట్, ఏలూరు. ఫోన్ : 83001 82704

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు
90102 23729
70133 28923
Office mail : tpgadvt@gmail.com